సాక్షి
వికారాబాద్
సోమవారం, 26, జూన్, 2023



యథేచ్ఛగా చెట్ల నరికివేత
హైదరాబాద్ – తాండూర్ ప్రధాన రోడ్డు పక్కనే చెట్లను నరికి యథేచ్ఛగా వాహనంలో తరలించారు. 8లో▸



'ఆగని' అక్రమ తవ్వకాలు
బషీరాబాద్ మండలంలోని నావరాతి గనుల్లో అక్రమ తవ్వకాల్లో కొత్త కోణం వెలుగు చూసింది. 8లో▸



పడకేసిన రూర్బన్ పథకం!
గ్రామీణ ప్రాంతాల్లో రూర్బన్ పథకం పనులు ముందుకు సాగడంలేదు. అధికారులు పట్టించుకోవడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

అనంతుని సేవలో రోహిత్‌రెడ్డి



అనంతగిరి: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆదివారం వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి తాండూరుకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో అనంత పద్మనాభస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం తరఫున ఘన స్వాగతం పలికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు భూమెళ్ల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పది చెక్ పోస్టుల ఏర్పాటు

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: బక్రీద్ సందర్భంగా ఆవులు, దూడల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆవులను, లేగదూడలను తరలించడం చట్ట ప్రకారం నేరమన్నారు. సంబంధిత అధికారులతో, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అన్ని వైపులా నుంచి వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేసేందుకు 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలంపల్లి చౌరస్తా, ధారూరు చౌరస్తా, మోమిన్‌పేట, అంతారం గేట్, కొత్లాపూర్, ఇందర్‌చేడ్, లక్ష్మీనారాయణపూర్, రాఘవాపూర్, అంగడిచిట్టంపల్లి, రావులపల్లిలో చెక్ పోస్టులు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి
- పార్టీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని పలు గ్రామాల యువకులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ విజయం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యథేచ్ఛగా నకిలీ విత్తనాల విక్రయం

పత్తాలేని వ్యవసాయ అధికారులు

తాండూరు రూరల్: వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నకిలీ విత్తనాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. గ్రామాల్లోకి వచ్చి తక్కువ ధరలకే పత్తి విత్తనాలు అమ్ముతున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన వ్యక్తి వారం రోజుల క్రితం తాండూరు మండలం గోనూర్ గ్రామంలో పత్తి విత్తనాలు విక్రయించాడు. పత్తి విత్తనాలతో పాటు గడ్డి విత్తనాలు కూడా అమ్మినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కేసు నమోదు

గోనూర్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ గ్రామానికి చెందిన వడ్డె ఎల్లప్ప గోనూర్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు 50 ప్యాకెట్లు, లూస్ 50 కిలోలు విక్రయించాడు. వ్యవసాయశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఎల్లప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొన్నది సగమే.. రైతన్న ఆగమే!

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు

- జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరి సాగు
- దిగుబడి 2.3 లక్షల మెట్రిక్ టన్నులు
- సర్కారు కొన్నది 94 వేల మెట్రిక్ టన్నులే
- ఎక్కువ మొత్తం దళారులకే విక్రయం
- ఒకటి అర తప్ప కేంద్రాలన్నీ మూసివేత

వికారాబాద్: యాసంగి దాటి వానాకాలం సీజన్ ప్రారంభమైనా.. ధాన్యం పండించిన రైతన్నకు కష్టాలు వీడలేదు. దిగుబడుల్లో సగం ధాన్యం కూడా కొనలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. తరుగు, తాలు, తేమ అంటూ కేంద్రాలు, రైస్ మిల్లర్ల నిర్వాహకులు కొర్రీలు పెడుతుండటంతో చాలా మంది రైతులు దళారులకే విక్రయించారు. ఈ విషయంలో అధికారులు.. ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు మొర పెట్టుకున్నా.. ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినా.. రాతపూర్వకంగా జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా రోడ్డెక్కి ధర్నాలు చేసినా.. ధాన్యం రోడ్డుపై పోసి నిరసన వ్యక్తం చేసినా? ఫలితం లేకుండాపోయింది. రైస్ మిల్లర్లు పెట్టిన నింబంధనలకు తలొగ్గి వారి చేతిలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరు కీలుబొమ్మల్లా మారిపోయారు. వెరసి ఈ సారి కూడా ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునే విషయంలో కష్టాలు, నష్టాలు తప్పలేదు. ఇటీవల మద్దతు ధరకు జొన్నలు కొంటామని కొనుగోలు చేశాక నాణ్యత లేవని తిరిగి రైతులను తీసుకెళ్లమని చెప్పడంతో రైతులు ఆందోళన బాటపట్టారు.

లక్ష్యం 1.75 మెట్రిక్ టన్నులు.. కొన్నది 94 వేల టన్నులు

యాసంగి సీజన్‌లో ఎప్పుడూ లేనివిధంగా ఈ సారి 93 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సగటున 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీంతో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 1.75 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాలో 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 94 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసిన నిర్వాహకులు ఒకటి అర తప్ప దాదాపు సెంటర్లన్నీ మూసి వేశారు.



కొనుగోళ్లకు కొర్రీలు పెడుతుండటంతో మన్నెగూడ వద్ద ధాన్యాన్ని రోడ్డుపై పోసి తగలబెట్టి ఆందోళనకు దిగిన రైతులు (ఫైల్)

దళారుల పాలే..

కొనుగోలు కేంద్రాల కొర్రీలతో రైతులు పండించిన ధాన్యంలో ఎక్కువ శాతం దళారులకే అమ్ముకోవాల్సి వచ్చింది. 'చివరి గింజ వరకు కొంటాం.. తడిసిన ధాన్యం సైతం కొంటామని' చెప్పిన ప్రభుత్వం చేతల్లో కనిపించలేదు. ధాన్యం పూర్తిస్థాయిలో కొనకుండానే కేంద్రాలు మూసి వేశారు. సుమారు 1.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ సీజన్‌లో రైతులు దళారులకు, వ్యవసాయ మార్కెట్లలో విక్రయించారు. దీంతో మద్దతు ధర లభించక తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం క్వింటాలు ధాన్యం ఏ గ్రేడ్ రూ. 2060, బీ గ్రేడ్ రూ.2040 చెల్లించి కొనుగోలు చేయగా దళారులకు క్వింటాలుకు రూ. 1500 నుంచి 1700 వరకు విక్రయించారు. దీంతో ఒక్కో క్వింటాలుకు రూ. 500 నుంచి 300 వరకు నష్ట పోవాల్సి వచ్చింది. ఈ లెక్కన జిల్లాలో రూ. 50 కోట్ల వరకు రైతులు నష్టపోవడం గమనార్హం. దీంతో పాటు తరుగు, తాలు అంటూ తూకాల్లో సైతం క్వింటాలుకు ఐదు నుంచి ఆరు కిలోల ధాన్యం తగ్గించారు.

రైస్ మిల్లర్ల ఆగడాలు

ఈ ఏడాది రైస్ మిల్లర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, సివిల్ సప్లై అధికారులు సైతం మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయలేక పోయారు. రైతులు వెళ్లి ఎమ్మెల్యేల ముందు మొర పెట్టుకున్నా...ప్రతి పక్షాలు ధర్నాలు చేసినా.. జిల్లా అధికారుల తనిఖీల్లో దోచుకంటున్న విషయం బట్ట బయలు అయినా వారి దోపిడీని ఎవ్వరు అడ్డుకోలేక పోయారు.

ఉప్పల్‌లో తిప్పలుండవ్!

- రింగ్‌రోడ్డులో ఆకాశ నడక మార్గం సిద్ధం
- స్కైవాక్‌ను నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తూర్పు దిక్కున మరో మణిహారం సిద్ధమైంది. ఉప్పల్‌లో వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆకాశ నడక మార్గం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. మంత్రి కేటీఆర్ నేడు ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. రామంతాపూర్, సికింద్రాబాద్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వైపు, ఉప్పల్ నుంచి రామంతాపూర్, సికింద్రాబాద్ వైపు.. ప్రతి రోజు వేలాది మంది పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి నగరానికి చేరుకొనే ప్రయాణికులు ఉప్పల్ రింగు రోడ్డు వద్ద రోడ్డు దాటేందుకు ఎంతో ప్రయాస పడుతుండేవారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే సుమారు 30 వేల మందికి పైగా ప్రయాణికులు సైతం ఎటు వైపు వెళ్లాలన్నా ఎంతో ఇబ్బందిగానే ఉండేది. ఈ క్రమంలో ఈజీగా రోడ్డు దాటేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్కైవాక్‌తో ఉప్పల్ రింగురోడ్డు వద్ద పాదచారులు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించనున్నారు.

నగరంలోనే మొదటిది..

దాదాపు రూ.25 కోట్లతో హెచ్‌ఎండీఏ ఉప్పల్ స్కైవాక్‌ను నిర్మించింది. 660 మీటర్ల పొడవు ఉన్న ఈ ఆకాశ నడక మార్గం నగరంలో మొట్టమొదటి నిర్మాణం. రాబోయే వందేళ్ల పాటు వినియోగంలో ఉండేలా ప్రజల అవసరాలకు అనుగుణంగా స్కైవాక్‌ను ఎంతో పటిష్టంగా నిర్మించినట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీనికోసం సుమారు వెయ్యి టన్నులకు పైగా స్ట్రక్చరల్ స్టీల్‌ను వినియోగించారు. వివిధ రకాల స్కైవాక్ నమూనాలను పరిశీలించిన అనంతరం హెచ్‌ఎండీఏ ప్రస్తుతం ఉన్న ఏర్పాటును ఖరారు చేసింది. ఇందుకోసం హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 2020లోనే పనులు ప్రారంభించినప్పటికీ కోవిడ్ కారణంగా నిర్మాణంలో జాప్యం నెలకొంది. ఎట్టకేలకు ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలోకి రానుంది.



బహుళ ప్రయోజన ఫంక్షన్ హాల్‌కూ శ్రీకారం..

ఉప్పల్ శిల్పారామం వద్ద హెచ్‌ఎండీఏ నిర్మించిన బహుళ ప్రయోజనాల ఫంక్షన్‌హాల్‌ను కూడా మంత్రి కేటీఆర్ సోమవారం నాటి పర్యటనలో ప్రారంభించనున్నారు. పెళ్లిళ్లు, పుట్టినరోజు వంటి వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. శిల్పారామం వద్ద చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫంక్షన్ హాల్‌ను ఏర్పాటు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వినియోగ చార్జీలు ఉంటాయని అధికారులు తెలిపారు.

స్కైవాక్ ప్రత్యేకతలు ఇవీ..

- మొత్తం పొడవు 660 మీటర్లు
- 37 పిల్లర్లు ఏర్పాటు చేశారు
- 3, 4, 6 మీటర్ల వెడల్పు కలిగి.. భూ ఉపరితలం నుంచి 6 మీటర్ల ఎత్తు
- నిర్మాణ వ్యయం : రూ.25 కోట్లు
- 8 లిఫ్టులు, 6 స్టేర్ కేసులు, 8 ఎలివేటర్లు
- బ్యూటిఫికేషన్ లుక్ కోసం పైభాగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 40 శాతం మేరకు రూఫ్ టాప్
- ప్రతిరోజు 20 వేల మందికి పైగా పాదచారులు, మరో 25 వేల మందికి పైగా మెట్రో ప్రయాణికులు స్కైవాక్‌ను వినియోగించుకోవచ్చు.
- ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఫ్రీగా చేయడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం ఉండదు.
- మెట్రో ప్రయాణికులు కాంకోర్ వరకు చేరుకుంటారు.

దళితులకు మూడెకరాలేవీ?

- మోసపూరిత వాగ్దానాలతో బీఆర్‌ఎస్ పాలన
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారం చేపట్టారని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుడుగుర్తి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటైతే దళితుణ్ని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక సీఎం సీటును వదలలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే మోసపూరిత వాగ్దానాలు చేసి అన్ని వర్గాల ప్రజలను నయవంచన చేశారని అన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని కలలు గన్న రాష్ట్ర ప్రజలకు నీళ్లు, నిధులు, నియామకాలు లేక అన్యాయానికి గురయ్యారని అన్నారు. ఉద్యోగాల క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరితే ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణం కోసం 5లక్షలు, 500లకే గ్యాస్ సిలిండర్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పుడుగుర్తి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, అతని 40 మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణం

శంకర్‌పల్లి: మోకిల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా మారేపల్లికి చెందిన మాణిక్యం (52) ఇటీవల పదోన్నతిపై మోకిల పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. ఈ నెల 10న బాధ్యతలు స్వీకరించాడు. ఆదివారం సంగారెడ్డిలోని తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

సాగు సంబరమయ్యేనా!

- జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు
- చాలా మండలాల్లో అత్యల్పం
- నేల పూర్తిగా తడిసిన తరువాతే విత్తు వేయాలంటున్న అధికారులు

తాండూరు: రెండు రోజులుగా కురిసిన వర్షానికి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు సాగు పనుల్లో బిజీ అవుతున్నారు. మరోవైపు ఈ సారి వర్షాభావ పరిస్థితులు ఉంటాయంటూ వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో విత్తనాలు వేసుకోవాలా.. వద్దా? అనే సందిగ్ధంలో రైతులున్నారు. జిల్లాలో దాదాపు 6 లక్షల ఎకరాలలో వానాకాలం పంటల సాగు అవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ప్రధానంగా పత్తి, కంది, వరి, మొక్కజొన్న మరో 12 రకాల పంటలు సాగవుతాయి. గతేడాది అధిక వర్షాలతో రైతులు సాగు చేసిన పత్తి, కంది పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో అందక నష్టాలను చవిచూశారు. ఈ సారైనా కాలం కలిసి వస్తుందనే ఆశతో సాగుకు సిద్ధమవుతున్నారు. శనివారం కురిసిన వర్షాలకు జిల్లాలో 21.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

ఏడు మండలాల్లో అత్యల్పం

జిల్లాలో 20 మండలాలు ఉండగా అందులో బొంరాస్‌పేట మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. 6 మండలాల్లో అధిక వర్షపాతం, 7 మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ ధ్రువీకరించింది. వర్షాభావ పరిస్థితులు నెల కొన్న మండలాల్లో వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అత్యల్ప వర్షపాతం నమోదైన వాటిలో బషీరాబాద్, యాలాల, కొడంగల్, దౌల్తాబాద్, దోమ, పరిగి, పూడూరు మండలాలు ఉన్నాయి.

నేల తడిసిన తర్వాతే సేద్యం..

ఇటీవల కురిసిన వర్షాలకు 89 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా భూములన్నీ ఎండిపోయాయి. రైతులు విత్తాలంటే తేలిక పాటి నెలల్లో 50 ఎంఎంల వర్షపాతం, నల్లరేగడి(బరువైన) నేలల్లో 75 ఎంఎంల వర్షపాతం నమోదుకావాలి. ఆ తర్వాత విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అయితే విత్తనాలు విత్తేందుకు 30 సెంటీ మీటర్ల లోతు వరకు నేలలు తడవాలని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం ఇలా.. (మిల్లీమీటర్లలో)

మండలం	నమోదైంది	సాధారణం
మర్పల్లి	94.1	97.2
మోమిన్‌పేట	134.8	110.2
నవాబ్‌పేట	151.8	100.9
వికారాబాద్	95.3	114.5
పూడూరు	58.9	96.9
పరిగి	63.1	83.8
కుల్కచర్ల	85.6	78.0
దోమ	59.6	74.4
బొంరాస్‌పేట	109.4	64.5
దారురు	143.0	96.3
కోట్‌పల్లి	104.1	100.4
బంట్వారం	133.1	105.4
పెద్దేముల్	121.1	96.4
తాండూరు	87.5	103.8
బషీరాబాద్	55.7	94.9
యాలాల	68.6	95.6
కొడంగల్	56.1	86.7
దౌల్తాబాద్	35.9	82.1
చౌడాపూర్	49.9	36.5
దుద్యాల	72.4	77.5
సగటు వర్షపాతం	89.0	89.8



బషీరాబాద్: ఎక్మాయిలో స్ప్రింక్లర్ల ద్వారా పొలానికి నీరు అందిస్తున్న రైతు బిచ్చప్ప

చినుకు రాలక.. విత్తనం మొలవక..

స్ప్రింక్లర్లతో నీరు అందిస్తున్న రైతులు

బషీరాబాద్: వానలు కురవక.. విత్తనం మొలవక రైతన్న ఆందోళనకు గురవుతున్నాడు. పదిహేను రోజుల కిందట విత్తు విత్తినా ఇంకా మొలకపోవడంతో కొందరు రైతులు ప్రింక్లర్లతో నీటిని అందిస్తున్నారు. మండలంలో రోహిణి, మృగశిర కార్తెలో పడిన చిన్నపాటి వర్షాలకు 25 శాతం మేర విత్తనాలు విత్తారు. భారీగా పెట్టుబడి పెట్టి ఖరీదైన విత్తనాలు వేసినా నేటికి వాన జాడలేదు. రోజు సాయంత్రం నల్లటి మేఘం కమ్ముకుని ఆశలు పుట్టిస్తుంది. కానీ వాన మాత్రం కురువడం లేదు. దీంతో దిక్కు తోచని రైతులు కొందరు ప్రింక్లర్ల ద్వారా నీటిని పారిస్తున్నారు. ఎక్మాయి గ్రామంలోజోగి బిచ్చప్ప అనే రైతు 5 ఎకరాల్లో మినుము విత్తనాలు వేశాడు. పదిహేను రోజులైన మొలకెత్తకపోవడంతో బోరు ద్వారా ప్రింక్లర్లు పెట్టి పొలాన్ని తడుపుతున్నాడు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ పద్ధతే పాటిస్తుండటం గమనార్హం. నీటి వసరు లేని రైతులు ఆకాశనికేసి చూస్తున్నారు.

"వర్షాభావ పరిస్థితులే అధికం



రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. రైతులు పంటలు పండించే విషయంలో తొందర పడకుండా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసిన తర్వాతే సేద్యం మొదలు పెట్టాలి. అడపాదడపా కురిసిన వర్షాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. పొలం పూర్తిగా తడిసిన తరువాతే విత్తనాలు వేసుకోవడం ఉత్తమం.

– డాక్టర్ సుధాకర్‌చౌరట్, ప్రధాన శాస్త్రవేత్త, ఏఆర్‌సీ, తాండూరు

పునాదుల్లోనే సమీకృత మార్కెట్



పునాదుల స్థాయిలోనే కొనసాగుతున్న మార్కెట్ నిర్మాణ పనులు

- నత్తనడకన నిర్మాణ పనులు
- క్యూరింగ్ పేరుతో ఆరునెలలు ఆలస్యం

వికారాబాద్ అర్బన్: ఇంటిగ్రేటెడ్ (సమీకృత) మార్కెట్ నిర్మాణం పనులు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. మార్కెట్ నిర్మాణం పూర్తయితే అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఎంతో మేలు జరగనుంది. పనులు సాగించడంలో సంబంధిత కాంట్రాక్టర్ తాత్సారం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారుల చొరవ చూపడంలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. 2020 లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. అధికారులు, రాజకీయ నాయకుల ఐక్యతా లోపంతో ఏడాది పాటు మార్కెట్ నిర్మాణం ఊసెత్తలేదు. 2021 జనవరిలో ప్రస్తుతం ఉన్న రైతు బజారు పక్కనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించారు. అయినా పనుల్లో తీవ్ర జాప్యం. గత ఏడాది ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరిగింది. అంతలోనే ఏమైందోకాని సీఎం చేతుల మీదుగా కూడా శంకుస్థాపన కాలేక పోయింది. నిధులు ఉన్నా ఏళ్ల తరబడి పనులు ప్రారంభానికి నోచుకోకపోవడం, ప్రారంభమైనా నత్తనడకన సాగడంపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అర్ధంతరంగా నిలిచిన పనులు

ఆరు నెలల క్రితం సంబంధిత కాంట్రాక్టర్ మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభించారు. పదిహేను రోజుల పాటు పనులు కొనసాగాక అకస్మాత్తుగా నిలిచిపోయాయి. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను ప్రశ్నించగా గ్రౌండ్ లెవల్‌లో వేసిన సిమెంట్ బెడ్ క్యూరింగ్‌కు కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇలా క్యూరింగ్ పేరుతో ఆరు నెలలు పనులు ఆపారు. 2021 పనులు ప్రారంభమైతే నిబంధనల ప్రకారం మార్కెట్ నిర్మాణం పనులు ఈ పాటికి పూర్తి కావాలి. పది రోజుల క్రితం పనులు తిరిగి ప్రారంభించిన కాంట్రాక్టర్, ఇంకా పునాదుల స్థాయిలోనే పనులు కొనసాగిస్తున్నారు. పనులు ఆపడం వెనుక కొంత కమీషన్ల గొడవ ఉందనే ప్రచారం జరుగుతుంది. కమీషన్ల గొడవ ఎవరెవరి మధ్య ఉందనే విషయం మాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

యాలాల: విద్యుదాఘాతానికి గురై మూడు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన శ్రీనివాస్‌కు దళిత బంధు పథకం మంజూరైంది. రూ. 3లక్షలతో మూడు గేదెలు కొనుగోలు చేశాడు. ఆదివారం ఉదయం గ్రామ శివారులో గేదెలను మేతకు వదిలాడు. శనివారం సాయంత్రం కురిసిన గాలివానకు 11 కేవీ విద్యుత్ తీగలు రవికుమార్ అనే రైతు పొలం ఫెన్సింగ్‌పై పడ్డాయి. అటుగా వెళ్లిన గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. తనను ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


భానుప్రకాశ్(ఫైల్)

మోమిన్‌పేట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏన్కతల గ్రామానికి చెందిన సీనియర్ రిపోర్టర్ కే మల్లేశం కుమారుడు భానుప్రకాశ్(23) శనివారం రాత్రి తన బైక్‌పై మోమిన్‌పేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని బోర్ల కత్వా వద్ద కల్వర్టు నిర్మాణం కోసం వేసిన పైప్‌లను ఢీకొని కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సదాశివపేటకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు సీజ్ చేసిన రేషన్ బియ్యం ఆటో

బొంరాస్‌పేట: మండలంలోని బుర్రితండా వద్ద ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం బుర్రితండా వద్ద ఎస్‌ఐ శంకర్, ఏఎస్‌ఐ కృష్ణ, సిబ్బంది శ్రీని వాస్, కిషన్, ఖాదర్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అందుబాటులో ఉచిత కంది విత్తనాలు

బొంరాస్‌పేట: జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద మండలానికి 60 క్వింటాళ్ల పీఆర్‌జీ -176 రకం కంది చిరు పొట్లాలు వచ్చాయని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అనురాధ తెలిపారు. సోమవారం నుంచి రైతులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రైతులు వారి క్లస్టర్ పరిధిలో పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు ఏఈఓలకు అందించి కంది విత్తనాలు పొందాలన్నారు. ఒక్కో రైతుకు 4కిలోల ప్యాకెట్ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

నందిగామ: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఆదివారం ఆయన నివాసంలో రూ. 11 లక్షల 23వేల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. నందిగామలోని అయ్యప్ప ఆలయ చరిత్ర చాలా గొప్పదని, ప్రతి ఏటా కార్తీక మాసంలో ఆలయంలో వేలాది మంది మాల ధారణ చేస్తారని తెలిపారు.

మొక్కజొన్న సాగు.. యాజమాన్య పద్ధతులు

- నల్ల రేగడి, ఎర్ర నేలలు అనుకూలం
- ప్రస్తుతం విత్తుకు అదను


నవాబుపేటలో సాగు చేసిన మొక్కజొన్న పంట


ప్రసన్నలక్ష్మి

నవాబుపేట: ప్రస్తుతం మొక్కజొన్న సాగుకు అనుకూలమైన సమయమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు ప్రస్తుతం మొక్కజొన్న సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మంచి లాభాలు పొందవచ్చని ఏవో ప్రసన్న లక్ష్మి తెలిపారు.

నేలలు

సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలమైనవి. చౌడు భూములు, నీరు నిలిచే భూములు సాగుకు అనుకూలం కావు. విత్తుకు ముందు మూడు నాలుగు సార్లు నాగలితో దుక్కి దున్నాలి. ఎకరాకు దాదాపు 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తర్వాత బోదె నాగలితో బోదెలు, కాలువలు చేసుకోవాలి.

విత్తే కాలం

సాధారణ పరిస్థితుల్లో వర్షాధార పంటను జూన్ 15నుంచి జూలై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు. రబీలో అక్టోబర్ 15నుంచి నవంబర్ 15వ తేదీ లోగా విత్తితే అధిక దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.

విత్తే పద్ధతి

మొదలు బోదె నాగలితో బోదెలు చేసుకోవాలి. తర్వాత విత్తనాన్ని బోదెకు పైనుంచి 1బై3 వంతు ఎత్తులో విత్తితే నీటి పారుదల సులభంగా ఉండడమే కాకుండా వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. మొలకెత్తిన పది రోజుల తర్వాత ఒత్తుగా మొలచిన చోట ఒక మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలు తీసివేయాలి.

కలుపు యాజమాన్యం

పంట విత్తిన తర్వాత రెండు, మూడు రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రాములు పిచికారీ చేయాలి. బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల కొన్ని గడ్డిజాతి కలుపు మొక్కలను ఒక నెల వరకు అదుపు చేయవచ్చు. మొక్కజొన్నను పప్పుజాతి పంటలతో అంతర పంటగా వేసినప్పుడు చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు గమనిస్తే 2, 4-డి సోడియం సాల్ట్ ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది.

అంతర కృషి

విత్తిన 30 - 35 రోజులకు పశువులతో (దంతి లేక గొర్రు) లేదా ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తర్వాత నత్రజని ఎరువును వేసి దాని వెంటనే బోదె నాగలిని నడిపిస్తే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు సక్రమంగా ఉపయోగపడుతుంది. ఈ విధంగా బోదె నాగలి నడిపితే మొక్కల కుదుళ్లపై మట్టి చేర్చబడి అవి పడిపోకుండా ఉంటాయి.

నీటి యాజమాన్యం

మొక్కజొన్న పూతకు ముందు, పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో బాగానీరు పెట్టడం అవసరం. 30 - 40 రోజుల్లోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానికరం. విత్తిన తర్వాత చేనులో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదు. సాధారణంగా పంట కాలంలో 6 - 8 నీటి తడులు అవసరం. విత్తనాలు వేసినప్పుడు, విత్తిన 15 రోజులకు, 30 -35 రోజులకు, పూత దశలో, పూత వచ్చిన 15 రోజులకు, గింజ పాలు పోసుకునే దశలో నీటి తడులను తప్పకుండా ఇచ్చేలా జాగ్రత్త పడాలి. దీర్ఘకాలిక వంగడాలను 1 -2 తడులు అధికంగా అవసరం అవుతాయి.

కాండం తొలుచు పురుగులు

ఇవి రెండు రకాలు. మచ్చల, చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. గులాబి రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా రబీ మొక్కజొన్నను ఆశిస్తుంది. ఇవి పైరు మొలకెత్తిన 10-20 రోజులకు సోకుతాయి. పిల్ల పురుగులు మొదట ఆకులపైన పత్ర హరితాన్ని గోకి తింటాయి. తర్వాత గుండు సూది తరహాలో రంధ్రాలు, పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కలిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల పువ్వు చనిపోయి ఎండిపోతుంది. దీనినే డెడ్‌హార్ట్ అంటారు. కాండం లోపల గుండ్రని లేదా ఎస్ ఆకారంలో సొరంగాలను ఏర్పరుస్తుంది. ఇవి పూతను, కంకిణి ఆశించడంతో దిగుబడి తగ్గుతుంది.

రసం పీల్చు పురుగులు

30 రోజులు పైబడిన పైరును పేనుబంక, చిగురు నల్లి ఆశించవచ్చు. పొడి వాతావరణంలో వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లేత కాండం నుంచి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క గిడస బారిపోతుంది. ఇవి విసర్జించే జిగుటు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి మసి తెగులు ఆశించడం వల్ల కిరణజన్య సంయోగ క్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నివారణ

సహజంగా అక్షింతల పురుగులు, సిర్ఫిడ్స్ వంటి పరాన్న భుక్కులు, పరాన్నజీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోపాస్ ఎకరాకు 320 మి.లీ లేదా డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగు ఆశించే అవకాశం ఉంది.

టర్సికమ్ ఆకు తెగులు

ఆకులపై పొడవైన, కోలాకారపు బూడిద రంగుతో ఆకుపచ్చ, గోధుమ వర్ణపు మచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు 2.5 నుంచి 25 సెం.మీ. పొడువు, 4 సెం.మీ. వెడల్పు ఉంటాయి. ఈ మచ్చలు మొదట మొక్కకింద ఆకులపై ఆగుపించి, పెద్దవై పై ఆకులకూ వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చలిపోయినట్లుగా కనిపిస్తాయి. శిలీంద్ర బీజాలు ఆకుల అడుగు భాగాన వలయాలుగా కనిపిస్తాయి. ఈ మచ్చలు కండంపైనా వ్యాపిస్తాయి.

తుప్పు తెగులు

ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల తరహాలో తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగే కొద్ది ఆకులపైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. ఉధృతి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. పై రెండు రకాల లెగుళ్ల నివారణకు మాంకోజెట్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారీ చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 2.5 గ్రాముల మాంకోజెట్ శిలీంద్రనాశినితో విత్తన శుద్ధి చేసుకోవాలి.

నేడు వికారాబాద్‌కు బస్సు యాత్ర

అనంతగిరి: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రజా సంఘాల నాయకుల బస్సుయాత్ర సోమవారం వికారాబాద్‌కు చేరుకోనున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మైపాల్ ఆదివారం తెలిపారు. ఈ యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల మీదుగా సాగుతోందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్యతో పాటు పలువురు నాయకులు రానున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణం కోసం రూ.10లక్షలు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈ యాత్ర సాగుతోందన్నారు. ఉదయం 10.30గంటలకు వికారాబాద్‌కు వచ్చే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దొంగకు దేహశుద్ధి


నిందితుడు రవీందర్

శంకర్‌పల్లి: మహిళ మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పరుగెత్తుతున్న దొంగను యువకులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, కోనాపూర్‌కు చెందిన సునంద ఆదివారం పని నిమిత్తం శంకర్‌పల్లికి వచ్చింది. మధ్యాహ్నం శంకర్‌పల్లిలోని కూరగాయల మార్కెట్ వైపు వెళుతుండగా దొంగ ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కొని పరుగు పెట్టాడు. మహిళ కేకలు వేయడంతో పట్టణానికి చెందిన యువకులు శ్రీకాంత్ ముదిరాజ్, ప్రశాంత్ కుమార్, హెస్సేన్ గమనించి దొంగను వెంబడించి గణేష్‌నగర్ కాలనీలో పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన దొంగ పేరు రవీందర్ అని, సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, రామ్సన్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ'గని' అక్రమ తవ్వకాలు


జీవన్గీ గనిలో కొనసాగుతున్న తవ్వకాలు

బషీరాబాద్: మండలంలోని నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాల్లో కొత్త కోణం వెలుగు చూసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో నాపరాతి నిక్షేపాలను వెలికి తీస్తున్న గని కార్మికులను కొందరు వ్యక్తులు బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. బషీరాబాద్ మండలం నవల్గా, కొర్విచెడ్, జీవన్గీ, క్యాద్గిర, మాసన్ పల్లి గనుల్లో ఇంకా తవ్వకాలు సాగుతున్నాయి. తవ్వకాలు జరిపే వారిలో 90 శాతం మంది వడ్డెర కార్మికులే. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో దశాబ్దాలుగా వడ్డెరులు తవ్వకాలు జరుపుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయం గురించి పట్టించుకోవడం లేదు. అయితే కార్మికులను అడ్డం పెట్టుకొని కొందరు బడా బాబులు ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపట్టారు. కొందరు అనుమతులు తీసుకున్నా రాయల్టీ చెల్లించకుండా అక్రమ రవాణా చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. కార్మికుల్లోనే కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. అలాంటి వారిపై సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తాం. ఈ వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గనుల దగ్గర నిఘా ఉంచాం. మళ్లీ దాడులు చేసి అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిస్తే గనులను సీజ్ చేస్తాం. అనుమతులు పొందిన తర్వాతే తవ్వకాలు చేపట్టాలి.

– వెంకటస్వామి, తహసీల్దార్, బషీరాబాద్

పండ్ల తోటల రైతులకు సాయం


పుల్లయ్యగౌడ్

బొంరాస్‌పేట: పర్యావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్‌ను తగ్గించి ఆక్సిజన్ వాయువును పెంచాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి వివిధ రకాల పండ్ల తోటల రైతులకు సాయం చేయనున్నట్లు జాగృతి గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా కోర్డినేటర్ పుల్లయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలోని రేగడిమైలారం, నాజ్‌ఖాన్‌పల్లి తదితర గ్రామాల్లో మామిడి తోటల యజమానులతో ఆయన మాట్లాడారు. 2018 తర్వాత మామిడి తోటలు సాగు చేసిన రైతులకు ఎకరానికి రూ. 5వేల నుంచి రూ. 12వేల వరకు ఆర్థిక సాయం అందివ్వనున్నట్లు తెలిపారు. అందుకు రైతులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు, ఫొటో ఇవ్వాలన్నారు.

ఆమనగల్లుకు ఏడీఏ కార్యాలయం

ఆమనగల్లు: ఆమనగల్లుకు నూతనంగా ఏడీఏ కార్యాలయం మంజూరైందని, ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ఎం రఘునందన్‌రావ్ ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఆమనగల్లు పట్టణంలో వివిధ డివిజన్ కార్యాలయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే సివిల్ కోర్టు ఏర్పాటు కాగా ఏడీఏ కార్యాలయం వచ్చిందన్నారు. త్వరలో ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలిపి ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇకనుంచి వారానికి ఆరు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రతిరోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఇర్విన్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మహేంద్రాచారి, శివ బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య యాదవ్, వెంకటయ్య గౌడ్, యాదయ్య గౌడ్, శ్రీనివాస్, యాదిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



యాచారం: నాగార్జునసాగర్ - హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. సాగర్ రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతంలో ఇటీవల జింకల సంచారం అధికమైంది, అటవీ ప్రాంతానికి కంచె లేకపోవడంతో జింకలు తరచూ రోడ్డుపైకి వస్తున్నాయి. ఆదివారం జింక రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి కొద్ది సేపటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు జింక కళేబరాన్ని దహనం చేశారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- పట్టించుకోని ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు


రాంపూర్ తండా సమీపంలో చెట్లను నరికి డీసీఎం వాహనంలోకి ఎక్కిస్తున్న కూలీలు

ధారూరు: ఆదివారం సాయంత్రం 5గంటల సమయం.. హైదరాబాద్ - తాండూర్ ప్రధాన రోడ్డు పక్కనే చెట్లను నరికి డీసీఎం వాహనంలో లోడ్ చేయడం పలువురిని ఆశ్చర్యపరిచింది. చెట్ల నరికివేతతో పర్యావరణం దెబ్బతింటుందని అధికారులు మొత్తుకుంటున్నా కలప వ్యాపారులు గ్రామస్థులను బుట్టలో వేసుకొని యథేచ్ఛగా కలప అక్రమ రవాణా చేస్తున్నారు. రోడ్డు పక్క పొలాల్లో ఉన్న చెట్లను నరికివేసి ధారూరు సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసులు, రెవెన్యూ, ఫారెస్టు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఆయా శాఖల వారికి నెలనెలా మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడు కలప లారీలకు జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు. మండలంలో కలప అక్రమ రవాణా మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. సాధారణంగా పొలాల్లోని చెట్లను నరకాలంటే రెవెన్యూ, ఫారెస్టు అధికారుల నుంచి విధిగా అనుమతి తీసుకోవాలి. కానీ కలప అక్రమ వ్యాపారులు ప్రభుత్వ పనిదినాల్లో కాకుండా సెలవు దినాల్లో చెట్లను నరికించి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. గాలికి కూలడంతో తరలిస్తున్నామని సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు కలప అక్రమ రవాణాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గాలికి కూలడంతో తీసుకెళ్లమన్నాం

రాంపూర్ తండా సమీప వ్యవసాయ పొలంలో చింత చెట్టు గాలికి కూలిపోయిందంటే తీసుకెళ్లడానికి అనుమతి ఇచ్చాం. కానీ దాన్ని అడ్డు పెట్టుకొని ఇతర చెట్లను నరికి వేయడం తమ దృష్టికి రాలేదు. రాంపూర్ తండా పరిధిలోని పొలాల్లో చెట్లు నరుకుతున్న విషయం తెలిసి అక్కడికి వెళ్లాం. కానీ వాహనం కనిపించలేదు. పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– జగన్, డిప్యూటీ ఫారెస్టు రేంజర్

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


సమావేశంలో మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

తాండూరు: శుభప్రద్‌పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి, వారిని ప్రోత్సహించడం అభినందనీయమని తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి అన్నారు. ఆదివారం తాండూరులోని సల్లా గార్డెన్‌లో శుభప్రద్‌పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శుభప్రద్‌పటేల్ చేసిన పోరాట పటిమ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతిభ పురస్కారాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీవాణి, జెడ్పీటీసీలు మంజుల, ధారాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, సంధ్యారాణి, కౌన్సిలర్ సోమశేఖర్, పీఆర్టీయూ, తపస్, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని దగ్గరుండి 108లో ఎక్కిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: అతివేగంగా వస్తున్న ఓ బైక్ వ్యక్తిని ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొంపల్లికి చెందిన యాదయ్య(58) రోడ్డు పక్క నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కుల్కచర్ల మండలం పీరంపల్లికి చెందిన శ్రీనివాస్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యాదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ విశ్వజన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న డీసీసీ అధ్యక్షుడు

కుల్కచర్ల నుంచి పరిగికి వెళుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ప్రమాదం జరిగిన ప్రదేశంలో తన వాహనాన్ని ఆపి 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న తరువాత ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా మెరుగైన వైద్యం కోసం ఉస్మానియాకు తరలించాలని వైద్యులు సూచించడంతో తన సొంత ఖర్చులతో వాహనం సమకూర్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


మోకిల గ్రామంలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బీఆర్‌ఎస్ మోకిల అధ్యక్షుడిగా గోపాల్‌చారిని ఎన్నుకున్న సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాకే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఓటు అడిగే హక్కు కూడా లేదన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు లింగం ముదిరాజ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ ఫరీద్, నాయకులు రవీందర్‌రెడ్డి, రామస్వామి, వెంకటేష్, హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్, రియాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ కృషి

- మంత్రి సబితారెడ్డి


బాలాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: పురాతన ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మంత్రి సబితా రెడ్డి తెలిపారు. ఆదివారం బాలాపూర్‌లోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోనేటి బావిని, గ్రామంలోకి బురుజును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో శివగంగా ఆలయం, తుక్కుగూడలోని వేంకటేశ్వర ఆలయం, ఆర్‌కేపురంలోని ఖిలా మైసమ్మ, జన్నాయిగూడలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి ఒక్కో గుడికి కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. వీటితో పాటు ఘట్‌పల్లి వీరాంజనేయ స్వామి, ఉప్పుగడ్డ తండా సేవాలాల్ మహరాజ్ గుడికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, నాయకులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రఘునందన్ చారి, గిరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.